


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 05-10-2025 | సంపుటి - 25 | సంచిక -141 | రూ : 4 | పేజీలు: 8


## దసరా పండుగ..
# టీజీఎస్ఆర్టీసీకి రూ. 110 కోట్ల ఆదాయం

- తొలుత 7,754 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయం
- ఆశించిన మేర ప్రయాణికులు లేకపోవడంతో 5,300 వరకు మాత్రమే తిప్పినట్లు అధికారులు వెల్లడి
- ఈసారి 50 శాతం వరకు అదనపు ఛార్జీల వసూలు



2లో

## త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు...
# కాల్ సెంటర్ ఏర్పాటు చేసిన ఎన్నికల సంఘం



- ఐదు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు
- మొదటి రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- ఫిర్యాదులు, సంబంధిత అంశాల కోసం కాల్ సెంటర్ ఏర్పాటు

2లో



2లో

## వచ్చేవారం భారత పర్యటనకు రానున్న
# బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

- అక్టోబర్ 8 నుంచి బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ భారత పర్యటన
- యూకే ప్రధాని అయ్యాక స్టార్మర్‌కు ఇదే తొలి అధికారిక భారత పర్యటన
- ముంబైలో ప్రధాని నరేంద్ర మోదీతో ఉన్నత స్థాయి సమావేశం
- వాణిజ్యం, రక్షణ, సాంకేతిక రంగాలపై ప్రధానంగా చర్చలు
- గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ప్రసంగించనున్న ఇద్దరు ప్రధానులు
- గత జులైలో మోదీ యూకే పర్యటనకు కొనసాగింపుగా ఈ భేటీ

# ఇక గూగుల్‌లో బస్సు కదలికలు




- సిటీతో పాటు జిల్లా బస్సుల సమాచారం సైతం
- ప్రభుత్వాన్ని కోరిన సంస్థ.. ఉన్నతాధికారులతో సమావేశం
- దీపావళికల్లా వివరాలు అందించేందుకు సిద్ధమవుతున్న ఆర్టీసీ

హైదరాబాద్: మీరు వాహనంలో ఒక ఊరు నుంచి మరో ఊరికి వెళుతున్నారు. ఆ ఊరి పేరును గూగుల్ మ్యాప్‌లో టైప్ చేస్తే.. ఆ ఊరికి ఎంత సమయంలో చేరుకుంటారో చెబుతుంది. ఆర్టీసీ బస్సుల సమాచారం సైతం ఇక 'గూగుల్ మ్యాప్స్'లో అందుబాటులోకి రానుంది. సిటీ బస్సులతో పాటు జిల్లా, అంతర్రాష్ట్ర బస్సుల కదలికలు కూడా కళ్ల ముందు కనిపించనున్నాయి.

### ఐటీ శాఖ ద్వారా ఒప్పందం!

తెలంగాణలో ఆర్టీసీ బస్సుల రాకపోకల సమాచారాన్ని ప్రయాణికులకు గూగుల్ మ్యాప్స్‌లో అందిస్తామని గూగుల్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇదే విషయాన్ని వివరిస్తూ ఆర్టీసీ ఎండీకి ఐటీ శాఖ లేఖ రాసింది. 'గూగుల్' ప్రతినిధి ఒకరు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని తాజాగా కలిసి చర్చించారు. ఆర్టీసీ బస్సుల లైవ్ డేటాను గూగుల్‌కు షేర్

తరువాయి 2లో

## విశాఖ అన్నదానంలో అపశ్రుతి..

- విశాఖపట్నం జాలరిపేటలో అన్నదాన కార్యక్రమంలో ప్రమాదం
- మరుగుతున్న గంజి మీదపడి 16 మంది చిన్నారులు, మహిళలకు గాయాలు
- ఆరుగురిని కేజీహెచ్‌కు తరలించి ప్రత్యేక చికిత్స
- గాయపడిన చిన్నారులను పరామర్శించిన నేతలు
- స్పందించిన సీఎం చంద్రబాబు.. కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు సేకరణ
- బాధితులకు అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు



2లో



## ఆ దుష్టులు మళ్లీ వస్తే..
# అన్నీ పీకేస్తారు : సీఎం చంద్రబాబు

2లో

- 2.9 లక్షల మంది డ్రైవర్ల ఖాతాల్లో రూ.436 కోట్లు జమ చేసిన కూటమి ప్రభుత్వం
- ఆటో డ్రైవర్ల కోసం ఉబర్ తరహాలో ప్రత్యేక యాప్ తీసుకొస్తామని చంద్రబాబు ప్రకటన
- డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ
- గత ప్రభుత్వ హయాంలో రోడ్లు ధ్వంసం అయ్యాయని, తాము బాగుచేశామని వెల్లడి
- పేదల సంక్షేమ పథకాల్లోనూ డబ్బులు దోచుకున్నారని తీవ్ర విమర్శలు



## తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు..
# సుప్రీంకోర్టులో పిటిషన్

- హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేసిన వంగ గోపాల్ రెడ్డి
- ఈ నెల 6న విచారించనున్న జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం
- ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు మోగిన నగారా

2లో



# దసరా పండుగ.. టీజీఎస్ఆర్టీసీకి రూ. 110 కోట్ల ఆదాయం

దసరా పండుగ సందర్భంగా రూ. 110 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వెల్లడించింది. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా తొలుత 7,754 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించినప్పటికీ, ఆశించిన స్థాయిలో ప్రయాణికులు లేకపోవడంతో 5,300 బస్సులను మాత్రమే తిప్పినట్లు అధికారులు తెలిపారు. పండుగ సందర్భంగా నడిపిన ప్రత్యేక బస్సులకు ఈసారి 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేశారు. గత ఏడాది ఇదే పండుగ సమయంలో 6,300 ప్రత్యేక బస్సులు నడపగా, రూ. 114 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందని, ప్రయాణికులు కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారని టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. ఈ నెల 5, 6 తేదీల్లో రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని సంస్థ నిర్ణయించింది.

# ఇక గూగుల్‌లో బస్సు కదలికలు

హైదరాబాద్: మీరు వాహనంలో ఒక ఊరు నుంచి మరో ఊరికి వెళుతున్నారు. ఆ ఊరి పేరును గూగుల్ మ్యాప్‌లో టైప్ చేస్తే.. ఆ ఊరికి ఎంత సమయంలో చేరుకుంటారో చెబుతుంది. ఆర్టీసీ బస్సుల సమాచారం సైతం ఇక 'గూగుల్ మ్యాప్స్'లో అందుబాటులోకి రానుంది. సిటీ బస్సులతో పాటు జిల్లా, అంతర్రాష్ట్ర బస్సుల కదలికలు కూడా కళ్ల ముందు కనిపించనున్నాయి.

**ఐటీ శాఖ ద్వారా ఒప్పందం!**

తెలంగాణలో ఆర్టీసీ బస్సుల రాకపోకల సమాచారాన్ని ప్రయాణికులకు గూగుల్ మ్యాప్స్‌లో అందిస్తామని గూగుల్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇదే విషయాన్ని వివరిస్తూ ఆర్టీసీ ఎండీకి ఐటీ శాఖ లేఖ రాసింది. 'గూగుల్' ప్రతినిధి ఒకరు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని తాజాగా కలిసి చర్చించారు. ఆర్టీసీ బస్సుల లైవ్ డేటాను గూగుల్‌కు షేర్‌చేయాలని కోరారు. ఈ మేరకు ఆర్టీసీ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. ఐటీ శాఖ ద్వారా గూగుల్‌కు బస్సుల సమాచారాన్ని దీపావళి కల్లా అందించాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్‌కు ఎండీ సూచించారు.

**30 సెకన్లకోసారి అప్‌డేట్**

ఆర్టీసీ బస్సులకు జీపీఎస్ సౌకర్యం ఉంది. ఈ బస్సుల లైవ్‌డేటాను గూగుల్‌కు షేర్ చేయడం ద్వారా గూగుల్ మ్యాప్స్‌లోనూ బస్సుల కదలికల్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. 30 సెకన్లకోసారి బస్సు ఎక్కడుందో తాజా సమాచారం తెలుస్తుంది. ముందు సిటీ బస్సుల్లో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లా బస్సులు, అంతర్రాష్ట్ర సర్వీసుల సమాచారం కూడా ఇందులో ఉండాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీసీలోని దాదాపు మొత్తం 9,500 బస్సుల లైవ్ డేటాను గూగుల్‌కు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.

**ఎలా పనిచేస్తుందంటే..**

గూగుల్ మ్యాప్స్‌లో ట్రాన్సిట్ (పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్) అనే సింబల్ కూడా ఉంటుంది. దాన్ని సెలెక్ట్ చేసుకుని ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలో టైప్ చేయాలి. విద్యానగర్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలనుకుంటే.. మీరున్నచోటు నుంచి బస్టాప్ ఎంతదూరంలో ఉంది.. సికింద్రాబాద్‌కు ఎన్ని నిమిషాల్లో బస్సు చేరుకుంటుంది.. ఎక్కాల్సిన బస్సు నంబరు.. తదితర వివరాలు వస్తాయి. హైదరాబాద్ నుంచి జనగామకు వెళ్లాలనుకుంటే.. బస్సు హైదరాబాద్‌లో ఏ స్టాపుల్లో ఆగుతుంది.. ఎన్ని నిమిషాలకు బస్సు వస్తుంది.. మధ్యలో ఎన్నిచోట్ల ఆగుతుంది.. ఒక బస్సు వెళ్లిపోతే ఆ తర్వాత మరొకటి ఎప్పుడు వస్తుందన్న వివరాలూ ఉంటాయి. ప్రస్తుతం ఆర్టీసీ 'గమ్యం' యాప్ ఉన్నప్పటికీ నిర్వహణ లోపాలతో గందరగోళంగా మారింది.

## విశాఖ అన్నదానంలో అపశ్రుతి...

# సీఎం చంద్రబాబు ఆవేదన

విశాఖపట్నం నగరంలో జరిగిన ఓ అన్నదాన కార్యక్రమంలో తీవ్ర అపశ్రుతి చోటుచేసుకుంది. వేడి గంజి మీద పడటంతో 16 మంది చిన్నారులతో పాటు పలువురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన శనివారం మధ్యాహ్నం జాలరిపేటలోని పిల్లా అప్పమ్మయ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద జరిగింది. దుర్గాదేవి మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో చిన్నారులు, మహిళలు హాజరయ్యారు. ఆహారం పంపిణీ చేస్తుండగా, వంట ప్రదేశంలో ఉన్న మరుగుతున్న గంజి పాత్ర ప్రమాదవశాత్తు వారిపై పడింది. దీంతో అక్కడ ఉన్న చిన్నారులు, మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్ర గందరగోళం, ఆర్తనాదాలు మిన్నంటాయి. వెంటనే స్పందించిన స్థానికులు, నిర్వాహకులు క్షతగాత్రులను విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రికి (కేజీహెచ్) తరలించారు. వీరిలో ఆరుగురి పరిస్థితి కాస్త ఆందోళనకరంగా ఉండటంతో వారిని ఆసుపత్రిలో చేర్చుకుని ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నారు. మిగిలిన 10 మందికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం వైద్యులు వారిని డిశ్చార్జ్ చేశారు.

**స్పందించిన సీఎం చంద్రబాబు**

ఈ ఘటనలో చిన్నారులు గాయపడడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంటనే విశాఖ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, చిన్నారుల ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి లోటూ రాకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అటవిశాఖపట్నం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్.. కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆసుపత్రికి వెళ్లి గాయపడిన చిన్నారులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇలాంటి కార్యక్రమాల్లో నిర్వాహకులు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు

# తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు.. సుప్రీంకోర్టులో పిటిషన్

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్ రెడ్డి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 6న ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనుంది. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమంటూ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు, బీసీ రిజర్వేషన్లకు సంబంధించి మాధవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఈ నెల 8న తిరిగి విచారణ జరపనుంది. ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రిజర్వేషన్ల అంశం హైకోర్టు, సుప్రీంకోర్టుకు చేరడం గమనార్హం. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.

# వచ్చేవారం భారత పర్యటనకు రానున్న బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ వచ్చే వారం భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఆయన అక్టోబర్ 8 నుంచి రెండు రోజుల పాటు ఇక్కడ అధికారిక పర్యటన చేపట్టనున్నారని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. యూకే ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కీర్ స్టార్మర్ భారత్‌కు రావడం ఇదే ప్రథమం. ఈ పర్యటనలో భాగంగా అక్టోబర్ 9న ముంబైలో ప్రధాని మోదీ, స్టార్మర్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఇరు దేశాల మధ్య కుదిరిన 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం' పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించనున్నారు. 'విజన్ 2035' రోడ్‌మ్యాప్‌లో భాగంగా వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సాంకేతికత, వాతావరణ మార్పులు, విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లో సహకారంపై చర్చిస్తారు. ముఖ్యంగా, ఇరు దేశాల ఆర్థిక భాగస్వామ్యానికి మూలస్తంభంగా భావిస్తున్న 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం' (సెటా) ద్వారా లభించే అవకాశాలపై వీరు ప్రముఖ వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతోనూ సంప్రదింపులు జరుపుతారు. పర్యటనలో భాగంగా ఇరువురు ప్రధానులు ముంబైలో జరిగే 6వ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొని కీలక ప్రసంగాలు చేస్తారు. ఈ కార్యక్రమం సందర్భంగా పారిశ్రామిక నిపుణులు, ఆవిష్కర్తలతోనూ భేటీ కానున్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత ఉన్న అంశాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. గత జులై 2324 తేదీల్లో ప్రధాని మోదీ యూకేలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటనలో కుదిరిన ఒప్పందాలకు, చర్చలకు కొనసాగింపుగా స్టార్మర్ పర్యటన జరగనుంది. ఆ సమయంలో ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక 'సెటా' ఒప్పందం కుదిరింది. అలాగే, రక్షణ ఉత్పత్తుల సహరూపకల్పన, సహఅభివృద్ధి, సహ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు 'రక్షణ పారిశ్రామిక రోడ్‌మ్యాప్'కు కూడా ఇరు దేశాలు ఆమోదం తెలిపాయి. తాజా పర్యటనతో భారత్‌యూకేల మధ్య భవిష్యత్ భాగస్వామ్యం మరింత దృఢంగా మారుతుందని విదేశాంగ శాఖ విశ్వాసం వ్యక్తం చేసింది.

# ఇవ్వని హామీ కూడా అమలు చేశాం

**: హోంమంత్రి అనిత**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ఏటా రూ.15,000 చొప్పున ఆర్థిక సాయం అందించే 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని ఏపీ కూటమి ప్రభుత్వం నేడు ప్రారంభించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర చీఫ్ మాధవ్ నేడు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దీనిపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సోషల్ మీడియాలో స్పందించారు. ఇచ్చిన హామీలు అమలు చేయడమే కాకుండా, ఇవ్వని హామీ కూడా అమలు చేసి ఆటోడ్రైవర్లను ఆదుకుంటున్నామని చెప్పారు. "గత ఏడాదిన్నరగా పేదల సేవలో తరిస్తున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం... ఇప్పుడు ఆటో డ్రైవర్లకు ఇవ్వని హామీని కూడా అమలు చేసి వారి కష్టాలు తీరుస్తోంది. రాష్ట్రంలో మహిళకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్లు నష్టపోతారన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 హామీలు అమలుతో ప్రజల చేత సూపర్ హిట్ అనిపించుకుంటున్న ప్రభుత్వం... ఇప్పుడు రాజకీయాలకు అతీతంగా ఆటోడ్రైవర్లకు సేవలో పథకాన్ని అమలు చేస్తోంది. విజయనగరంలో నిర్వహించిన 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమ ప్రారంభోత్సవంలో పాల్గొనడం జరిగింది. విజయనగరం జిల్లాలో ఆటోడ్రైవర్ల కోసం విడుదల చేసిన రూ.3 కోట్ల 38 లక్షల 70 వేల రూపాయల చెక్కును ఆటోడ్రైవర్లకు అందించడం జరిగింది. అంతకుముందు విజయనగరం జిల్లా పరిషత్ అతిథి గృహం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఆటోలో ప్రయాణించాను. కష్టానికి, శ్రామికశక్తికి ప్రతిరూపమైన ఖాకీ షర్ట్ వేసుకోవడం గౌరవంగా అనిపించింది. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ యశస్విని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ, జిల్లా కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు" అని అనిత తన పోస్టులో వివరించారు.

## త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు...

# కాల్ సెంటర్ ఏర్పాటు చేసిన ఎన్నికల సంఘం

తెలంగాణ రాష్ట్రంలో తొలి రెండు దశల్లో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం ఐదు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, మిగతా మూడు దశల్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించబడతాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎన్నికల సమాచారం, ఫిర్యాదులు మరియు సంబంధిత అంశాలపై వివరాల కోసం 9240021456 నెంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలియజేసింది. తెలంగాణ రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 565 జెడ్పీటీసీ స్థానాలకు, 5,749 ఎంపీటీసీ స్థానాలకు, 12,733 గ్రామ పంచాయతీలకు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 23న తొలి విడత, అక్టోబర్ 27న రెండో విడత పోలింగ్ జరుగుతుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న పోలింగ్ ఉంటుంది. పోలింగ్ పూర్తయిన తర్వాత ఏ విడత ఫలితాలను అదే రోజు ప్రకటిస్తారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎన్నికల సంఘం వెల్లడించింది.



# ఆ దుష్టులు మళ్లీ వస్తే అన్నీ పీకేస్తారు: సీఎం

రాష్ట్రంలో గత పాలకులు సృష్టించిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించామని, అలాంటి దుష్టులు మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు మిగిలినవి కూడా పీకేస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలాంటి వారి పాలన రాష్ట్రానికి ఇక వద్దని, ప్రజలే వారిని తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం జరిగిన 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఆటో, మ్యాక్సీ క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లను ఉద్దేశించి ప్రసంగించారు. పేదల సంక్షేమ పథకాల్లోనూ డబ్బులు దోచుకున్న వారు రాజకీయాలకు పనికిరారని, ప్రజలకు చెడు జరగకుండా కాపాడుకోవడమే నిజమైన పండుగని అన్నారు. అవే మనకు ఈ దసరా, దీపావళి పండుగల పాఠాలు. మనకు ఇక ఈ వైకుంఠపాళి వద్దు అని పేర్కొన్నారు. మీకు మంచి చేసిన కూటమి ప్రభుత్వం గురించి పది మందికి చెప్పండి అని సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం డ్రైవర్లకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది అర్హులైన డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లోకి రూ.436 కోట్లను నేరుగా జమ చేసినట్లు ప్రకటించారు. డబ్బులు ఖాతాలో పడ్డాయో లేదో చూసుకోవాలని ఆయన కోరగా, ఆటోడ్రైవర్లు తమ సెల్‌ఫోన్లలో వచ్చిన బ్యాంకు మెసేజ్‌లను చూపిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఏ ఒక్కరికైనా సాంకేతిక కారణాలతో డబ్బు జమ కాకపోతే, అర్హతలను పరిశీలించి వెంటనే జమ చేస్తామని హామీ ఇచ్చారు.

**ఉబర్ తరహా యాప్.. సంక్షేమ బోర్డు**

ఆటో డ్రైవర్ల కష్టాలను తీర్చేందుకు టెక్నాలజీని వినియోగిస్తామని చంద్రబాబు తెలిపారు. వారి కోసం ఉబర్ తరహాలో ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించి, బుకింగ్‌లు సులభంగా లభించేలా చూస్తామన్నారు. దీనికోసం ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఆటో స్టాండుల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. డ్రైవర్ల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు 'ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. క్రమశిక్షణతో మెలిగి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి సహకరించాలని డ్రైవర్లకు సూచించారు.

*** గత పాలనపై విమర్శలు.. కూటమి పాలనపై ప్రశంసలు**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని, పాలన పూర్తిగా స్తంభించిపోయిందని చంద్రబాబు విమర్శించారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారి, డ్రైవర్ల సంపాదనంతా రిపేర్లకే పోయేదని గుర్తుచేశారు. అన్యాయంగా జరిమానాలు వేసి వేధించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 16 నెలల్లోనే 23 వేల కిలోమీటర్ల రోడ్లను మరమ్మతులు చేసి, గుంతలు లేని రోడ్లను అందించామన్నారు. పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను కూడా గత పాలకులు మూసివేశారని, తాము వాటిని పునఃప్రారంభించి రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో దశలవారీగా అన్ని వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని, ఇందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే రాష్ట్రం, కేంద్రంలో అభివృద్ధి సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.



# పత్తి రైతుల సౌకర్యార్థం కపాస్ కిసాన్ యాప్ శిక్షణా కార్యక్రమం






ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై సమగ్ర శిక్షణా కార్యక్రమం సాఫ్ట్వేర్ టెక్నికల్ బృందం సహకారంతో నిర్వహించబడింది. ఈ శిక్షణా కార్యక్రమం పత్తి రైతులకు మరింత సులభతరమైన, పారదర్శకమైన డిజిటల్ విధానంలో కొనుగోలు సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో చేపట్టబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ప్రాంతీయ మార్కెటింగ్ ఉప సంచాలకురాలు వి. పద్మావతి, సిపిఓ సంజీవరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ , వ్యవసాయ అధికారి బాబురావు తో కలిసి పాల్గొన్నారు అనంతరం ఆమె మాట్లాడుతూ, కపాస్ కిసాన్ యాప్ రైతులకు ఒక సమగ్ర సమాచార వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ పత్తి అమ్మకాల వివరాలు, రోజువారీ మార్కెట్ ధరలు, పంట తూకం వివరాలు, చెల్లింపు సమాచారాన్ని సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. యాప్ ద్వారా పత్తి కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెరిగి, రైతులకు సమయానికి న్యాయమైన ధర అందేలా చర్యలు చేపట్టినట్లు ఆమె వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు మాట్లాడుతూ, డిజిటల్ టెక్నాలజీ వినియోగం ద్వారా రైతులు మధ్యవర్తుల దుర్వినియోగం నుండి రక్షించబడతారని, మార్కెట్ లావాదేవీలపై స్పష్టమైన సమాచారం అందుకోవచ్చని అన్నారు. కపాస్ కిసాన్ యాప్ రైతుల చేతుల్లో సమాచార శక్తిని అందిస్తున్నదని, దీనిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాల పనితీరులో సమయపాలన సామర్థ్యం పెరుగుతుందని, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా డిజిటల్ పద్ధతిలో జరగడం వలన నమ్మకం పెరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సాఫ్ట్వేర్ కంపెనీ ప్రతినిధులు యాప్ వినియోగంపై ప్రాక్టికల్ ప్రదర్శన ఇచ్చి, ఏ ఈ ఓ లు, ఎం ఈ ఓ లు, ఏ డి ఏ , మార్కెటింగ్ సిబ్బందికి దశలవారీగా యాప్ ఉపయోగించే విధానం వివరించారు. జిల్లాలోని అన్ని వ్యవసాయ విస్తరణాధికారులు (ఏ ఈ ఓ లు), మండల వ్యవసాయాధికారులు (ఎం ఈ ఓ లు), అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడిఏలు) మార్కెటింగ్ శాఖ సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొని యాప్ యొక్క సాంకేతిక అంశాలను ప్రత్యక్షంగా నేర్చుకున్నారు. పాల్గొన్న అధికారులు యాప్ పై తమ సందేహాలను వ్యక్తపరచగా, టెక్నికల్ బృందం వాటికి సమాధానాలు ఇచ్చారు.

## నేడు అందోలులో అలాయ్ బలాయ్

* **హాజరు కానున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచెంద్రారావు రాక**
* **ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎంపీ బీబీ పాటిల్**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు నియోజకవర్గ అలయ్ బలయ్ కార్యక్రమం అందోలు శివారులోని లక్ష్మినర్సింహ ఫంక్షన్ హాలులో ఈనెల 5వ తేది ఆదివారం నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచెంద్రారావు హజరు కానున్నట్లు మాజీ ఎంపీ బీబీ పాటిల్ తెలిపారు. శనివారం ఫంక్షన్ హాలులో స్థానిక నాయకులతో సమావేశమై ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే కార్యక్రమానికి నియోజకవర్గంలోని అందోలు, పుల్కల్, చౌటకూరు, మునిపల్లి, రాయికోడ్, వట్పల్లి, పుల్కల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి బీజేపీ నాయకులు ఈ కార్యక్రమానికి హజరు కానున్నారని తెలిపారు.

## వికలాంగులకు, గర్భిణీలకు ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వాలి

* **జిల్లా కలెక్టర్ కు పీఆర్ టీయూ వినతి**



అందోలు, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ఎన్నికల కమీషన్ ద్వారా త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పేర్కొనబడిన ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుండి 70 శాతం పైన అంగ వైకల్యం కలిగిన ఉపాధ్యాయులకు, గర్భిణీ ఉపాధ్యాయినిలు, ఫీడింగ్ సుదర్స్ దీర్ఘకాలిక వ్యాధులచే బాధపడుచున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా పీఆర్ టీయూ జిల్లా పక్షాన జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్లకు వినతి పత్రాలను సమర్పించినట్లు జిల్లా అధ్యక్షుడు ఎ. మాణయ్య తెలిపారు. పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులు (6 నెలలలోపు), ఎన్నికలు జరిగే రోజులలో వివాహాది శుభ కార్యాలు గల ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సీనియారిటీ ప్రాతిపదికన (పే స్కేల్ ఆధారంగా) విధుల కేటాయింపు (తక్కువ కేడర్ ఉపాధ్యాయులకు కేటాయించిన స్థానే ఉన్నత కేడర్ ఉపాధ్యాయుల కేటాయింపు) ను జరపాలని కోరినట్లు తెలిపారు. అందుకు అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి ఆకుల ప్రభు, వివిధ మండల నాయకులు తెలిపారు.

## గ్యార్మీ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీక

* **బిఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గ్యార్మీ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని బిఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు. గ్యార్మీ ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం మైనార్టీ నాయకులు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో గల దర్గా లో నిర్వహించిన గ్యార్మీ ఉత్సవాలకు ఆయన హజరై ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గిరిగుట్ట డివిజన్ సర్వమతాలకు నిలయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ సాజిద్, జి.ప్రభాకర్,సయ్యద్ మాజీద్,మోజస్, ఫిరోజ్,ఆనంద్,మైలారం రాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది

**: భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చర్ల మండలంలోని ఛత్తీస్గఢ్ రాష్ట్ర సరిహద్దు గ్రామాలైన బట్టిగూడెం,బత్తినపల్లి ,రామచంద్రాపురం గ్రామాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ సందర్శించారు. సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ కంపెనీ కమాండర్ సెబాస్టియన్,చర్ల సీఐ రాజు వర్మ , ఇతర పోలీస్ అధికారులు,సిబ్బందితో కలిసి ఈ మూడు మావోయిస్ట్ ప్రభావిత గ్రామాల్లోని 120 కుటుంబాలను సందర్శించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ఈ మూడు గ్రామాల ప్రజలకు నెస్లే కంపెనీ వారి సహకారంతో నిత్యావసర వస్తువులను అందించారు.ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సారథ్యంలో ఏజెన్సీ ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని,మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.ఇందులో భాగంగానే జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే అదివాసీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వర్షాల అనంతరం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.డెంగీ,మలేరియా వంటి విషజ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.అభివృద్ధి నిరోధకులైన నిషేదిత మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని కోరారు. ప్రత్యక్షంగానైనా,పరోక్షంగానైనా మావోయిస్టులకు సహకరిస్తే,అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొనబడతాయని అన్నారు.మారుమూల ఏజెన్సీ ప్రజలకు నిత్యావసర వస్తువులను అందించడానికి ముందుకొచ్చిన నెస్లే కంపెనీ వారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.




## ఆదివాసి ప్రాంతాలను జనరల్ చేయడం రాజ్యాంగ విరుద్ధం

* **సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: స్థానిక ఎన్నికల సందర్భంగా ఆదివాసి ప్రాంతాలను జనరల్ రిజర్వుడ్ చేయడం రాజ్యాంగానికి, ఐదవ షెడ్యూల్కి వ్యతిరేకమని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కొమరం సత్యనారాయణ అన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఈరోజు జరిగిన జిల్లా ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్లో ఆదివాసి ప్రాంతాలైన గుండాల, ఆళపల్లి, ఇల్లందు, టేకులపల్లి, భద్రాచలం, చర్ల మండలాల్లోని సర్పంచ్, ఎంపీపీ, జడ్పిటిసి స్థానాలను ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకుండా జనరల్గా కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని, ఐదవ షెడ్యూల్ను ఉల్లంఘించడం అని తెలిపారు.ఆదివాసీ హక్కులను కాలరాస్తూ, ఖనిజ సంపదను దోచుకునేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులను తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కూడా అవమానిస్తోంది" అని కొమరం సత్యనారాయణ విమర్శించారు.ఆదివాసీ ఆధిక్యం ఉన్న ప్రాంతాల్లోని స్థానాలను తక్షణమే ఎస్టీ రిజర్వేషన్ కింద చేర్చాలని, లేదంటే ప్రజా ఉద్యమాలతో పోరాటం చేపడతామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలోని కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో భద్రాచలం, ఇల్లందు కేంద్రాలుగా ఆదివాసి జిల్లాలుగా ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్ను ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తుచేశారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కందగట్ల సురేందర్, నాయకులు ఉప్పరబోయిన రామ్మూర్తి, మల్లూరి సుగుణ, ఎ సాంబ, జె గణేష్, ఉమ తదితరులు పాల్గొన్నారు.సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ప్రజలను బీజేపీ, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను స్థానిక ఎన్నికలలో ఓడించమని పిలుపునిచ్చింది.

## బీటెక్ విద్యార్థినికి లాప్ టాప్ అందజేత



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: పట్టణంలోని ఓ బీటెక్ విద్యార్థినికి మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ సహకారంతో తిరుమల సేవా ఫౌండేషన్ ఫౌండర్ చల్ల తిరుమలరావు శనివారం లాప్ టాప్ ను అందజేశారు. ఖమ్మం సమీపంలోని పొన్నెకల్లు లో గల శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న బత్తుల సాధ్వికకు లాప్ టాప్ అవసరమని దిండిగల రాజేందర్ దృష్టికి తీసుకువెళ్లగా తిరుమల సేవా ఫౌండేషన్ వారితో మాట్లాడి లాప్ టాప్ ఇవ్వడం జరిగింది. ఆసక్తితో చదివి ఉన్నత స్థాయికి చేరాలని వారు ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు తమ వంతు సాయం చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల సేవా ఫౌండేషన్ చైర్మన్ రాజు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, రామ్ లాల్ పాసి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మిగణపతి దేవాలయంలో అన్నదానం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం గ్రామంలోని శ్రీ లక్ష్మిగణపతి దేవాలయం వద్ద శ్రీదేవి శరన్నవరాత్రులు ఘనంగా ముగిశాయి. ఈ పుణ్య సందర్భంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నారాయణసేవ (అన్నదానం) కార్యక్రమం శనివారం నిర్వహించారు. పది రోజుల పాటు అమ్మవారు ప్రతి రోజు భిన్న అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. చివరి రోజున నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఫణికుమార్, వంగ వెంకట్, లయన్ పితాని సత్యనారాయణ, వాళ్ళల రాజేశం, రామకృష్ణ, లయన్ పగడాల నాగేశ్, రఘు, శ్రీనివాస్ రెడ్డి, నరేంద్రబాబు, సాంబయ్య, రవీంద్ర, బోయిని రాజేశ్, సమ్మయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి, త్యాగం, మానవతా విలువల పండుగ గ్యార్మీ పండుగ

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : భక్తి, త్యాగం, మానవతా విలువల పండుగ గ్యార్మీ పండుగ అని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ గంప బస్తీలోని హజ్రత్ సయ్యద్ షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ రహమతుల్లా అహ్లె, చిల్లా షరీఫ్ దర్గా నందు మైనారిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్మీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ముస్లీం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలతా సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, అడప శేషు, సిద్దిక్, సాజిద్, శౌతం రాయ్, నదీమ్, రషీద్, రఫీక్, అంజద్, ఇస్మాయిల్, హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి దామోదర్ కు దసరా శుభాకాంక్షలు వెల్లువ

* పెద్ద ఎత్తున హాజరై శుభాకాంక్షలు తెలిపిన కన్ సాన్ పల్లి కాంగ్రెస్ నాయకులు
* స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తావని మంత్రికి హామీ

అందోలు, ప్రజాస్ఫూర్తి : దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సీ. దామోదర రాజనర్సింహాకు విజయదశమి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున మంత్రి నివాసానికి వెళ్లి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి విశేష భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి పూజలు ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక వేడుకగా జరుపుకున్నారని అన్నారు. ఊరు, వాడలంతా అమ్మవారి సంబురాలతో భక్తి భావం ఉట్టిపడిందన్నారు. ప్రధానంగా ఈ ఏడాది బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా శ్రమిస్తున్న ప్రజాప్రభుత్వానికి ప్రజల మద్దతు, దుర్గమ్మ ఆశీస్సులు లభించాలని కోరుకున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా ముందుకెళ్లాలని సూచించారు. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేస్తూ మంత్రికి వివరించారు.



కార్యక్రమంలో ఏఎంసి మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు తెనుగు మహిపాల్,మొరబోయిన కృష్ణ ముదిరాజ్, అందులపల్లి రమేష్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిలుకంటి వీరేశం,బేగరి జాను,చెక్రాల వెంకయ్య, రామన్నగారి నర్సింలు,జోగాల గోవర్ధన్, ఉసిరికపల్లి యాదయ్య,కలపల్లి ప్రభు, మొరబోయిన ఈశ్వరయ్య, వని దుర్గేష్, వని సత్తయ్య, కడెం పోచయ్య, బేగరి యేసయ్య, తలారి యాదయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు వరం

* బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్




జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు వరమని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నందు "ఇస్మాయిలీ సివిక్" ఆధ్వర్యంలో ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఈ ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఇస్మాయిల్ సివిక్ సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా నిరుపేదలకు వైద్య సేవలు అందించేందుకు మరిన్ని శిబిరాలను "ఇస్మాయిలీ సివిక్" ఏర్పాటు చేయాలని, వారికి మా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు పదికి పైగా ఆస్పత్రులు పాల్గొని దాదాపు 400 మంది నిరుపేదలకు తమ వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితాశ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, నాయకులు జంధా కుమార్, సంగీతా రెడ్డి, వేణు యాదవ్, ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ అధ్యక్షులు ఇక్బాల్ మందని తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ నగరంలో పెరగనున్న బస్సు ఛార్జీలు




తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్సు ఛార్జీలను సవరించనుంది. భాగ్యనగరం పరిధిలో నడిచే ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీలను పెంచాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ఆర్డినరీ బస్సుల్లో మొదటి స్టాప్ నుంచి మూడు స్టాపుల వరకు ఛార్జీని రూ. 5, నాలుగు స్టాపుల తర్వాత ఛార్జీని రూ. 10 వరకు పెంచనున్నారు. మెట్రో డీలక్స్, ఈమెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టాప్ వరకు రూ. 5, రెండో స్టాప్ నుంచి రూ.10 వరకు ఛార్జీలను పెంచాలని సంస్థ నిర్ణయించింది. పెరిగిన ధరలు అక్టోబర్ 6వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం విదితమే. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల డీజిల్ బస్సుల స్థానంలో రాబోయే రెండేళ్లలో 2,800 ఎలక్ట్రిక్ బస్సులను దశల వారీగా ప్రవేశపెట్టాలని సంస్థ భావిస్తోంది. ఇందుకోసం మరో పది డిపోలను అదనంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 10 ఛార్జింగ్ స్టేషన్లు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. డిపోలు, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, వాటి నిర్వహణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఛార్జీలను సవరించాల్సి వస్తోందని, ఇందుకు ప్రజలు సహకరించాలని టీజీఎస్ఆర్టీసీ ఒక ప్రకటనలో తెలిపింది.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

* సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ శ్రేణులు సత్తా చాటేందుకు సిద్ధం కావాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు.శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సిపిఐ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, ప్రజా మరియు కార్మిక సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతర పోరాటం సాగిస్తోందని తెలిపారు. నిత్యం ప్రజల్లో మమేకమయ్యే పార్టీ సిపిఐ ఒక్కటేనని, ఇతర పార్టీలు ఎన్నికల సమయానికే కనిపిస్తాయని వ్యాఖ్యానించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.గ్రామ, మండల కమిటీలే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఈ ఎంపికలో ఎలాంటి వత్తిళ్లకు తావివ్వొద్దని సూచించారు. ప్రజల్లో ఆదరణ కలిగిన, బలమైన అభ్యర్థులను ఎంపిక చేసి గెలిపించుకోవడమే పార్టీ బలం అని పేర్కొన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న సిపిఐ శతవసంతాల ముగింపు బహిరంగ సభకు సిద్ధతలు ప్రారంభమయ్యాయని, ఈ సభ విజయవంతం కావడం కోసం ఆదివారం (5న) ఖమ్మంలో ఆహ్వానసంఘ సమావేశం జరగనున్నదని తెలిపారు. ఈ సమావేశాన్ని పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, భూక్య దస్రు, ధీటి లక్ష్మీపతి, కోమారి హన్మంతరావు, గుత్తుల సత్యనారాయణ, ధనలక్ష్మి, జక్కుల రాములు, రత్నకుమారి, తాళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## మోదీ సాహసోపేత నిర్ణయాలతో సురక్షితంగా దేశం

* కాషాయం జెండా ఎగురవేసే దిశగా పని చేయాలి
* బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారత్ వైపు శత్రు దేశాలు కన్నెత్తి చూడటానికే భయపడేలా చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల్లో దేశం సురక్షితంగా ఉందని, మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలే దేశాన్ని బలమైనశక్తిగా నిలబెట్టాయని బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ అన్నారు. ముస్తాబాద్‌లోని ఎఎంఆర్ గార్డెన్‌లో ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల ప్రభారీలు, బూత్ అధ్యక్షులు, ఆపై స్థాయి నాయకుల సమావేశంలో నియమావళి అభ్యర్థుల యొక్క జాబితా రిజర్వేషన్లు పరిశీలన, ఎన్నికలకు సంసిద్ధం చేసే దిశగా చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన 6గ్యారెంటీలు, 420 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, మహిళలు, యువతను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా మోసం చేసిందని విమర్శించారు. యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ముస్తాబాద్ మండల పరిషత్ మీద కాషాయం జెండా రిజర్వేషన్ దిశగా కార్యకర్తలు పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రబారీ దేవసాని కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బుచ్చెల్లి మహేశ్వరీ, చిట్టినేని శ్రీనివాస రావు, మీసా శంకర్, సరదాని నందం, కామటి గారి పద్మ, బెదుర ప్రశాంత్, కాసోడి రమేష్, చీకోటి మహేష్, కరెడ్ల రమేష్ రెడ్డి, కస్తూరి కార్తీక్ రెడ్డి, వరి వెంకటేష్, కోల కృష్ణ, నాంపల్లి కనకయ్య తదితరులున్నారు.

## మరుగున పడ్డ ప్రజా మరుగుదొడ్లు

* ఎందుకు ప్రారంభించారు..ఎందుకు తాళం వేసారు
* జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్



ప్రజా స్ఫూర్తి , భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణ పరిధిలో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు మరుగున పడిపోయాయని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు పబ్లిక్ ప్లేసులో మరుగుదొడ్లు నిర్మించాలని అనేక పోరాటాలు చేయగా గత ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట,హెడ్ ఆఫీస్ సంత వద్ద అదేవిధంగా బస్టాండ్ సెంటర్ లో నవభారత్ వారి ద్వారా నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు నేటి పాలకుల అసమర్థత వల్ల కొన్ని నెలలుగా తాళాలు వేసి దర్శనమిస్తున్నాయని, అధికారులు మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురాకపోవడం చాలా దౌర్భాగ్యమన్నారు.ప్రజల అవసరార్థం నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు ఎందుకు ప్రారంభించారు..ఇప్పుడు తీయకుండా ఎందుకు తాళలు వేశారని ప్రశ్నించారు.అధికారులు వెంటనే స్పందించి పట్టణంలో నిరుపయోగంగా ఉన్న ప్రజా మరుగుదొడ్లను ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని డిమాండ్ చేశారు.

## సౌరకుటుంబంలోకి కొత్త అతిథి.. భూమికి ప్రమాదం ఉందా? నాసా క్లారిటీ



మన సౌరకుటుంబంలోకి బయటి నుంచి వేగంగా దూసుకొస్తున్న '3ఐ/అట్లాస్' అనే తోకచుక్కతో భూమికి ఎలాంటి ప్రమాదం లేదని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా స్పష్టం చేసింది. సెకనుకు 61 కిలోమీటర్ల (గంటకు సుమారు 2.21 లక్షల కిలోమీటర్లు) అసాధారణ వేగంతో ఇది ప్రయాణిస్తున్నప్పటికీ, దీని వల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ప్రస్తుతం ఈ తోకచుక్క కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు నాసా పేర్కొంది. మన సౌర వ్యవస్థకు చెందని ఖగోళ వస్తువులను గుర్తించడం ఇది మూడోసారి. గతంలో 2017లో 'ఔమువాముహా', 2019లో '2ఐ/బోరిసోవ్' అనే వస్తువులను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇప్పుడు గుర్తించిన 3ఐ/అట్లాస్‌ను సౌరకుటుంబం బయటి నుంచి వచ్చిన మూడో అతిథిగా పరిగణిస్తున్నారు. దీని పేరులోని 'ఐ' అక్షరం 'ఇంటర్‌స్టెల్లార్' (నక్షత్రాల మధ్య నుంచి వచ్చింది) అని సూచిస్తుంది.

## అన్నదాన కార్యక్రమం.. మరుగుతున్న గంజిపడి.. 16 మంది చిన్నారులకు గాయాలు

విశాఖ (వన్‌టౌన్): మరుగుతున్న గంజి మీద పడటంతో 16 మంది చిన్నారులు సహా మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన విశాఖలోని జాలరిపేట పిల్లా అప్పమ్మయ్య సంఘం వద్ద చోటుచేసుకుంది. దుర్గాదేవి మండపం వద్ద శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యేందుకు చిన్నారులు, మహిళలు అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ వంట జరుగుతున్న ప్రాంతంలో ప్రమాదవశాత్తు మరుగుతున్న గంజి 16 మంది చిన్నారులు, మహిళలపై పడింది. వెంటనే క్షతగాత్రులను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని



కోరారు. ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. మిగిలిన 10 మందికి ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపించాలని వైద్యులు నిర్ణయించారు. ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ తదితరులు గాయపడిన చిన్నారులను విశాఖ కేజీహెచ్‌లో పరామర్శించారు.

## అసత్య ప్రచారాలు చేస్తే చెప్పు తెగుద్ది.. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తికి పరిటాల సునీత వార్నింగ్

ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాప్తాడు రాజకీయం రోజురోజుకు హీటెక్కుతోంది. ఉప్పు, నిప్పులా ఉండే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత మధ్య మాటల యుద్ధం మరోసారి పీక్‌కు చేరింది. హౌసింగ్ లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యే పరిటాల సునీత రూ.10 వేలు వసూలు చేస్తున్నారని తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. నిరుపేదలని కూడా చూడకుండా లబ్ధిదారుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటున్నారని ఫైర్ అయ్యారు. ఈ క్రమంలోనే తోపుదుర్తి చేసిన ఆరోపణలకు పరిటాల సునీత ఇవాళ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇవాళ రాప్తాడులో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. హౌసింగ్ లబ్ధిదారుల నుంచి తాను ఒక్క రూపాయి




తీసుకున్నట్లుగా నిరూపిస్తే దేనికైనా రెడీ అంటూ సవాలు విసిరారు. కారు కూతలు కూస్తే కఠిన చర్యలు తప్పవని ఫైర్ అయ్యారు. తనపై మరోసారి అసత్య ప్రచారాలు, అబద్ధాలు చెబితే చెప్పు తెగుద్దని మాస్ వార్నింగ్ ఇచ్చారు. కడుపుకు కూడు తినేవాడు ఎవడూ అలా మాట్లాడరని అన్నారు. పది రూపాయలు జేబులోంచి తీసి నిరుపేదలకు సాయం చేసే గుణం పరిటాల కుటుంబానిదని, ఇతరుల వద్ద చేయి చాచడం తమ రక్తంలోనే లేదని సీరియస్ అయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డే ఆ పని చేసి ఉంటాడని.. లేకపోతే ఇలాంటి ఆరోపణలు ఎలా చేస్తారని పరిటాల సునీత కౌంటర్ అటాక్ చేశారు.

# జాతీయ రహదారి 65 సిక్స్ వే విస్తరణ పనులు జనవరిలో ప్రారంభం



జాతీయ రహదారి 65 విస్తరణ పనులకు సంబంధించి డిసెంబర్ లో టెండర్లు ఆహ్వానించి జనవరి నెలలో విస్తరణ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం చిట్యాల మండలంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటికే ఎలాంటి అలైన్మెంట్ జరగలేదని రైతులు దీనిపై అపోహలు పెట్టుకోకుండా ఉండాలన్నారు. త్రిబుల్ ఆర్ నిర్మాణానికి సంబంధించి అలైన్మెంట్ జరిగినట్లు, రైతులు భూములు కోల్పోతున్నట్లు మీడియాలో వస్తున్న అపోహాలు ఎవరు నమ్మొద్దని, అలాంటి ప్రక్రియ ఏమి జరగలేదని అన్నారు. డిసెంబర్ లో అలైన్మెంట్ ప్రక్రియ పూర్తయ్యాక సీఎం తో మాట్లాడి మంత్రిమండలిలో చర్చించిన అనంతరం రైతులకు న్యాయం చేస్తామన్నారు. దీనిపై ఆయా గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి రైతులతో మాట్లాడి వారిని ఒప్పించిన అనంతరం పనులు చేపడతామన్నారు. దివిస్ కంపెనీ కోసం త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ లో మార్పులు చేస్తున్నట్లు మీడియాలో వస్తున్న సమాచారం అవాస్తవమని, త్రిబుల్ ఆర్ నిర్మాణానికి సంబంధించి ఒకసారి అలైన్మెంట్ అయ్యాక వాటిలో పెద్ద పెద్ద కంపెనీలు వచ్చిన లేదా రాజకీయ నాయకుల భూములు వచ్చిన అలైన్మెంట్ మార్చే ప్రసక్తి లేదని దీనిపై ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కందిమల్ల శశిపాల్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై
# సుప్రీంకోర్టులో పిటిషన్

ఢిల్లీ: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్‌రెడ్డి సెప్టెంబరు 29న సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈనెల 6న పిటిషన్‌పై విచారణ జరపనుంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలకు ఇటీవల నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో



గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది.

# సికింద్రాబాద్‌లో అగ్నిప్రమాదం.. ఆరు దుకాణాలు దగ్ధం

కంటోన్మెంట్ : సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధి లోతుకుంట వద్ద ఓ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. లోతుకుంట ప్రధాన రహదారి పక్కనే ఉన్న సైకిల్ దుకాణంలో చెలరేగిన మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించడంతో అగ్నిప్రమాద తీవ్రత పెరిగింది. ఈ అగ్ని ప్రమాద ఘటనలో ఆరు దుకాణాలు దగ్ధం కాగా ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో ఘటన స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దుకాణాలలో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.




షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించి ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

# క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరైన ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి

హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో విచారణ జరుగుతోంది. క్రాస్ ఎగ్జామినేషన్‌కు ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఇద్దరు ఎమ్మెల్యేలను పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ఎగ్జామినేషన్ చేస్తున్నారు. అక్టోబర్ 1న అసెంబ్లీలో స్పీకర్ సమక్షంలో ఫిరాయింపు నోటీసులు స్వీకరించిన



ఎమ్మెల్యేలను వారిపై ఫిర్యాదు చేసిన భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అయితే సమయం సరిపోకపోవడంతో.. ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్యల విచారణ మాత్రమే పూర్తయింది. ఈక్రమంలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డిల క్రాస్ ఎగ్జామినేషన్ నేడు నిర్వహిస్తున్నారు.

## అమెరికాలో దుండగుడి కాల్పులు..
# హైదరాబాద్ విద్యార్థి మృతి




హైదరాబాద్: అమెరికాలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో తెలంగాణకు చెందిన విద్యార్థి మృతి చెందాడు. ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ 2023లో బీడీఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. ఇవాళ తెల్లవారుజామున డాలస్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో చంద్రశేఖర్ మృతి చెందాడు. బీఎన్‌రెడ్డి నగర్‌లో ఉన్న బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మాజీమంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఉన్నత స్థానంలో ఉంటాడనుకున్న కుమారుడు ఇక లేడన్న విషయం తెలిసి తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన చూసి గుండె తరుక్కు పోతోందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి..**

చంద్రశేఖర్ మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అతడి మరణం ఆవేదన కలిగించిందన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు.

# నాగార్జునసాగర్‌కు వరద ప్రవాహం.. 26 గేట్లు ఎత్తి నీటి విడుదల

నాగార్జున సాగర్: నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అధికారులు 26 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయానికి 2.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. ఔట్ ఫ్లో కూడా అంతే మొత్తంలో విడుదల చేస్తున్నారు. సాగర్ కుడి కాల్వకు 10,040 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కులు, పవర్ హౌస్‌కు 33,291 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. స్పిల్ వే ద్వారా 2.16 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం



590 అడుగులు.. కాగా ప్రస్తుతం 587.30 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 305.68 టీఎంసీలుగా నమోదైంది.

## ఆరు నెలల్లోపు టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలు పూర్తి చేయకపోతే ఉద్యమిస్తాం: హరీశ్‌రావు

హైదరాబాద్: గతంలో టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాన్ని కేసీఆర్ తలపెట్టారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నిర్మాణ పనులను రేవంత్‌రెడ్డి సర్కార్ నత్తనడకన చేస్తోందని విమర్శించారు. కొత్తపేటలో టిమ్స్ భవనాలను పార్టీ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు. పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఉండి ఉంటే.. ఇప్పటికే టిమ్స్ పూర్తయ్యేదని చెప్పారు. రాజకీయాలను పక్కనపెట్టి కంటి వెలుగు కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారులో ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బకాయిలు పెట్టారని విమర్శించారు. కేసీఆర్ తీసుకొచ్చిన మంచి పనులు ఆపాలనే ఆలోచనలో సీఎం ఉన్నారని



దుయ్యబట్టారు. ఆరు నెలల్లోపు టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలు పూర్తి చేయాలని.. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# MBBS, BDS మేనేజ్‌మెంట్ కోటా సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ షురూ




కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం (కేఎన్‌ఆర్ యూహెచ్‌ఎస్) 202526 విద్యా సంవత్సరానికి గాను మేనేజ్‌మెంట్ కోటా (బీ, సీ కేటగిరీ) కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సెకండ్ ఫేజ్ కౌన్సిలింగ్ వెబ్ ఆప్షన్ల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 4, 2025న మధ్యాహ్నం 3:00 గంటల నుండి అక్టోబర్ 6, 2025న మధ్యాహ్నం 1:00 గంటల వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ తెలిపింది. అభ్యర్థులు https://tspvtmedadm.tsche.in/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆప్షన్లను వినియోగించుకోవాలి. సెప్టెంబర్ 22, 2025న కేఎన్‌ఆర్ యూహెచ్‌ఎస్ వెబ్‌సైట్‌లో విడుదల చేసిన ఫైనల్ మెరిట్ జాబితాలో పేరు ఉన్న అభ్యర్థులు మాత్రమే వెబ్ ఆప్షన్లకు అర్హులు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్ సీటు పొంది, కళాశాలలో చేరి కొనసాగుతున్న అభ్యర్థులు కూడా ఈ దశలో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడానికి అర్హులు. అయితే, మొదటి దశలో సీటు కేటాయించినా రిపోర్ట్ చేయని లేదా కోర్సును నిలిపివేసిన అభ్యర్థులు, అలాగే మొదటి దశలో వెబ్ ఆప్షన్లు ఇవ్వని అభ్యర్థులు ఈ రెండో దశ కౌన్సెలింగ్‌కు అనర్హులు. సీటు పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేమెంట్ గేట్‌వే ద్వారా యూనివర్సిటీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎంబీబీఎస్‌కు బీ కేటగిరీ అభ్యర్థులు రూ. 40,000, సీ, ఎన్‌ఆర్‌ఐ కేటగిరీ అభ్యర్థులు రూ. 70,000 చెల్లించాలి. ఈ ఫీజు చెల్లించిన తర్వాత అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న ఏ కోర్సు, కళాశాలకైనా, ఎన్నింటికైనా ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఈ దశలో సీటు కేటాయించబడితే, మొదటి దశలో కేటాయించబడిన సీటు ఆటోమేటిక్‌గా రద్దవుతుంది. అభ్యర్థులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ఆప్షన్లు ఎంచుకోవాలి. సీటు కేటాయించిన అభ్యర్థి, అలాట్‌మెంట్ ఆర్డర్‌లో పేర్కొన్న చివరి తేదీలోగా కళాశాలలో చేరకపోతే, వారి అడ్మిషన్ ఆటోమేటిక్‌గా రద్దవుతుంది. అటువంటి అభ్యర్థులకు సీటు బ్లాకింగ్‌ను నివారించడానికి తదుపరి రౌండ్లలో అవకాశం ఇవ్వబడదు. మరిన్ని వివరాల కోసం http://knruhs.telangana.gov.in లో చూడవచ్చు.

**ఎంబీబీఎస్ 413, బీడీఎస్ 128 సీట్లు**

తెలంగాణలోని ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు సంబంధించిన ఖాళీల వివరాలు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ఈ వివరాల ప్రకారం రెండో దశ కౌన్సెలింగ్‌కు గాను ఎంబీబీఎస్ కోర్సులో 413 సీట్లు, బీడీఎస్ కోర్సులో 128 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం కలిపి 526 సీట్లు ఈ దశలో భర్తీకి అందుబాటులో ఉన్నాయని విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది. ఎంబీబీఎస్ లోకల్ కోటా 199, అన్ రిజర్వ్‌డ్ 111, ఎన్‌ఆర్‌ఐ (సీ కేటగిరీ) 113 సీట్లు ఉన్నాయి. ఇక బీడీఎస్ బీ కేటగిరీలో లోకల్ 76, అన్ రిజర్వ్ డ్ 23, ఎన్‌ఆర్‌ఐ కోటా 29 మొత్తం కలిపి 128 బీడీఎస్ సీట్లు ఖాళీలుగా ఉన్నాయి.

## కాంగ్రెస్ నాయకులకు
# పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ టాస్క్

దేశంలో ఓటు చోరీ పెద్ద ఎత్తున జరిగిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుబంధ సంఘంగా పని చేస్తోందని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ అన్ని ఆధారాలతో ఓటు చోరీలను బయటపెట్టారని అయినా ఈసీ నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. ఇవాళ రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో జూమ్ మీటింగ్ నిర్వహించిన మహేశ్ కుమార్ గౌడ్.. టీపీసీసీలోని ప్రతినిధులతో మాట్లాడారు. భారీ వర్షాల దృష్ట్యా ఓటు చోరీకి వ్యతిరేకంగా రాష్ట్రంలో సంతకాల సేకరణ కార్యక్రమం ఆలస్యం అయిందన్నారు. ఇప్పటి నుంచి ప్రతి



గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టాలని, ప్రతి గ్రామంలో కనీసం వంద మందితో సంతకాలు చేయించి బీజేపీ ఓటు చోరీ ఎలా చేసిందో ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు ప్రతి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టాలని ఆదేశించారు.

# మలేషియా టూర్‌లో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మలేషియాలోని కౌలాలంపూర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా భారతీయ అసోసియేషన్ ఆఫ్ మలేషియా అధ్యక్షుడు చొప్పరి సత్య, ప్రధాన కార్యదర్శి రవితేజ శ్రీదాస్యం, ట్రెజరర్ సునీల్ కుమార్, అలాగే BAM కోర్ కమిటీ సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్‌కి ఘన



స్వాగతం పలికారు. ఈ మేరకు BAM ప్రతినిధులు మాట్లాడుతూ.. మన దసరా, బతుకమ్మ, దీపావళి మహోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈటల రాజేందర్ రాకతో ఈ వేడుక మరింత వైభవంగా సాగనుందని తెలిపారు. ఆయన కుటుంబం హాజరు కావడం మనందరికీ మరింత ఆనందాన్నిచ్చింది అని వెల్లడించారు. ఇవాళ, రేపు ఆయన మలేషియాలోనే ఉండి అనంతరం తిరుగు ప్రయాణం అవుతారని సమాచారం.

# గత రెండేళ్లలో బిహార్‌లో 50 లక్షల మందికి ఉపాధి: ప్రధాని నరేంద్ర మోదీ

గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువత సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలనతో పోలిస్తే నితీశ్ ప్రభుత్వం బిహార్ విద్యా బడ్జెట్‌ను అనేక రెట్లు పెంచిందన్నారు. అందువల్లే నేడు బిహార్‌లోని మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 19 జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలను



ఆమో దించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 'స్టూడెంట్ క్రెడిట్ కార్డ్' ద్వారా పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడానికి మద్దతిస్తోందన్నారు. 20 ఏళ్ల క్రితం బిహార్‌లో విద్యావ్యవస్థపై జరిగిన విధ్వంసం వల్ల యువత ఇతర రాష్ట్రాలకు తరలిపోవాల్సి వచ్చిందని ప్రధాని అన్నారు. అప్పటి ప్రభుత్వం చేసిన తప్పు వల్ల బిహార్‌కు వలసలు ప్రధాన సమస్యగా మారాయన్నారు. వాటిని అరికట్టాలంటే రాష్ట్రంలోనే ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని.. అందుకు అనుగుణంగా నీతీశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తమ ప్రభుత్వం గత దశాబ్దంలో దేశంలో 5,000 ఐటీఐల ను ప్రారంభించిందని.. అవి పారిశ్రామిక విద్యకు ముఖ్యమైన కేంద్రంగా మాత్రమే కాకుండా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి వర్క్‌షాప్‌లుగా కూడా పనిచేస్తున్నాయన్నారు. దేశంలోనే బిహార్‌లో అత్యధిక యువ జనాభా ఉందని.. బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నో ఏళ్లు యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. దాంతో దేశంలో అభివృద్ధి కుంటుపడిందని మోదీ మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం భారత్ మూడో ఆర్థికశక్తిగా రూపుదిద్దుకునేందుకు సిద్ధమవుతోందన్నారు. బిహార్‌లో విద్యార్థుల కోసం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం సేతు పథకాన్ని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్యా, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

## గాయకుడు జుబీన్ గార్గ్ మృతి కేసులో ట్విస్ట్.. విషమిచ్చినట్లు ఆరోపణలు



అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తూ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతోన్న వేళ ఈ కేసు కీలక మలుపు తిరిగింది. జుబీన్‌కు విషమిచ్చి ఉంటారని ఆయన బ్యాండ్‌మేట్ శేఖర్ జ్యోతి గోస్వామి సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడి మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ ఈ కుట్రకు పాల్పడి ఉంటారని ఆరోపించారు. జుబీన్ మృతిపై అస్సాం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పలువురు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. జుబీన్ బ్యాండ్‌మేట్ గోస్వామి కూడా విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగానే సంచలన ఆరోపణలు చేశారు. "సింగపూర్‌లో జుబీన్‌తో కలిసి ఆయన మేనేజర్ సిద్ధార్థ్ శర్మ ఒకే హోటల్‌లో ఉన్నారు. యాట్ ట్రిప్‌లో గాయకుడికి ప్రమాదం జరిగిన తర్వాత శర్మ తీరు అనుమానాస్పదంగా కన్పించింది. సముద్రం మధ్యలో ఆ విహార నౌకను మేనేజర్ బలవంతంగా తన నియంత్రణలోకి తీసుకున్నారు. అంతకుముందు మా అందరికీ డ్రింక్స్ తీసుకురావొద్దని అస్సాం అసోసియేషన్ (సింగపూర్) సభ్యుడు, ఎన్ఆర్ఐ తన్మోయ్‌కు చెప్పారు. సిద్ధార్థ్ శర్మనే స్వయంగా డ్రింక్స్ తీసుకొచ్చారు" అని గోస్వామి తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఇక, జుబీన్ గార్గ్ మునిగిపోతున్న సమయంలోనూ శర్మ 'అతన్ని వెళ్లనివ్వండి' అంటూ అరవడం తనకు వినిపించిందని గోస్వామి వెల్లడించారు. గార్గ్ శిక్షణ పొందిన స్విమ్మర్ అని, తనతో పాటు ఎంతోమందికి స్విమ్మింగ్‌లో కోచింగ్ ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన ఈత కొడుతూ నీట మునిగి చనిపోయే ఆస్కారమే లేదని అభిప్రాయం వ్యక్తంచేశారు. మేనేజర్ శర్మతో కలిసి ఈవెంట్ ఆర్గనైజర్ శ్యామ్‌కాను మహంత ఈ కుట్రకు పాల్పడి ఉంటారని గోస్వామి ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే వారు జుబీన్‌కు విషమిచ్చి ఉంటారని అన్నారు. ఆ తర్వాత దాన్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారని ఆరోపించారు. జుబీన్ నోరు, ముక్కు నుంచి నురగ వస్తున్నప్పుడు కూడా మేనేజర్ ఏమాత్రం కంగారు పడలేదని అన్నారు. వెంటనే వైద్య చికిత్స అందించకుండా ఆలస్యంగా చేశారని పేర్కొన్నారు.

## మావోయిస్టులు లొంగిపోవాల్సిందే: అమిత్ షా

ఆయుధాలు వదిలేసి చర్చలకు వచ్చే విషయంలో మావోయిస్టుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టులతో ఇక ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపదని.. ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామన్నారు. ఆ విధంగా లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని.. పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బస్తర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన



హోంమంత్రి 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని పునరుద్ఘాటించారు. మావోయిస్టులు తమతో చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని.. ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని ప్రశ్నించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతా దళాలు తగిన సమాధానం ఇస్తాయని మావోయిస్టులను హెచ్చరించారు. మార్చి 31, 2026 తర్వాత ఇటువంటి గ్రామాల అభివృద్ధిని మావోయిస్టులు అడ్డుకోలేరని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం రూ.4లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని..భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

## నవంబరు 23న.. భారత్‌కు నీరవ్‌మోదీ అప్పగింత..?

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.వేల కోట్ల మేర మోసగించి యూకే పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ అప్పగింత వ్యవహారం ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అతడిని భారత్‌కు అప్పగించేందుకు మార్గం సుగమమైనట్లు సమాచారం. నవంబరు 23న నీరవ్‌ను భారత అధికారులకు అప్పగించే అవకాశాలున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. అప్పగింత ప్రక్రియకు సంబంధించి భారత ప్రభుత్వం బ్రిటిష్ అధికారులకు తాజాగా హామీపత్రం అందజేసింది. నీరవ్‌ను భారత్‌కు తీసుకొచ్చాక కేవలం మోసం, మనీలాండరింగ్ కేసుల్లో మాత్రమే విచారిస్తామని, ఇతర ఏజెన్సీల కస్టడీకి ఇవ్వబోమని అందులో పేర్కొన్నట్లు సమాచారం. సీబీఐ, ఈడీ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్, కస్టమ్స్, ఆదాయపు పన్ను విభాగం సంయుక్తంగా ఈ హామీ పత్రాన్ని అందజేసినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. అంతేగాక, భారత్‌కు అప్పగించిన తర్వాత నీరవ్ మోదీని ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైల్లో ఉంచనున్నట్లు అందులో పేర్కొన్నారట. అతడికి హై ప్రొఫైల్ ఖైదీలకు అందించే సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించినట్లు సమాచారం. తన అప్పగింత ప్రక్రియను సవాల్ చేస్తూ ఇటీవల నీరవ్ మోదీ మరోసారి కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తనను భారత్‌కు అప్పగిస్తే దేశంలోని బహుళ విచారణ సంస్థలు దర్యాప్తు పేరుతో చిత్రహింసలకు గురిచేస్తాయని అతడు తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ కేసు మొత్తాన్ని తిరిగి ప్రారంభించాలని అభ్యర్థించాడు. ఈ పిటిషన్‌ను లండన్ కోర్టు అంగీకరించింది. ఈ క్రమంలోనే భారత దర్యాప్తు సంస్థలు హామీ పత్రాన్ని సమర్పించాయి. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. నవంబరు 23న తదుపరి విచారణ సమయంలో అతడిని భారత్‌కు అప్పగించే అవకాశాలున్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి.

### ఏంటీ కేసు..?

తప్పుడు ఎల్‌వోయూలతో పీఎన్‌బీని నీరవ్ మోదీ మోసగించిన వైనం 2018 జనవరిలో వెలుగుచూసింది. దీంతో ఈ కుంభకోణంపై ఈడీ, సీబీఐ దర్యాప్తు ప్రారంభించాయి. అయితే, అప్పటికే అతడు



దేశం విడిచి పారిపోయాడు. ఈడీ అతడిని పరారైన ఆర్థిక నేరగాడిగా ప్రకటించింది. నీరవ్ తమ దేశంలోనే నివసిస్తున్నాడని 2018 డిసెంబరులో బ్రిటన్ ప్రభుత్వం భారత్‌కు తెలియజేసింది. అతడిని అప్పగించాలని భారత్ విజ్ఞప్తి చేసింది. 2019 మార్చిలో నీరవ్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. అతడిని భారత్‌కు అప్పగించడానికి 2021లో అప్పటి బ్రిటన్ హోం మంత్రి ప్రీతి పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని సవాల్ చేస్తూ అతడు లండన్ హైకోర్టులో అప్పీల్ చేసుకున్నప్పటికీ కోర్టు తిరస్కరించింది. బెయిల్ కోసం దరఖాస్తు చేసినా అన్నిసార్లు భంగపాటుకు గురయ్యాడు.

## జపాన్ తదుపరి ప్రధానిగా సనై తకైచి..

### తొలిసారి మహిళకు అవకాశం..!

పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఈక్రమంలో తదుపరి ప్రధానిగా తకైచి బాధ్యతలు తీసుకునేందుకు మార్గం సుగమమైంది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించనున్నారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబాపై ఒత్తిడి పెరగ్గా.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరగ్గా.. మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకైచి విజయం సాధించారు. ఇక, దేశ తదుపరి ప్రధానిని



ఎన్నుకునేందుకు జపాన్ పార్లమెంటు అక్టోబరు 15న ఓటింగ్ నిర్వహించనున్నట్లు రాయిటర్స్ తెలిపింది. తాజాగా మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమిని ఆమె ఓడించారు. 64 ఏళ్ల తకైచి 1993లో స్వస్థలమైన నారా నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రితో సహా పలు కీలక పదవుల్లో పనిచేశారు. ఈ గెలుపు తనకు సంతోషం ఇవ్వడం కంటే.. బాధ్యతను పెంచిందని ఈసందర్భంగా తకైచి పార్టీ సభ్యులతో పేర్కొన్నారు.

## అరేబియా సముద్రంలో పోర్టు నిర్మాణం కోసం పాక్ ప్రయత్నాలు!

అమెరికా పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు ఇటీవల బలపడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అరేబియా సముద్రంలో పోర్టు నిర్మాణంపై పాక్ అమెరికా అధికారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ ఇటీవల అగ్రరాజ్యంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే ఈ ప్రతిపాదనలు చేసినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం.. అరేబియా సముద్రంలో ఓడ రేవు నిర్మించే అంశం గురించి మునీర్ యూఎస్ అధికారుల ముందు ఉంచారు. దీంతో తమ దేశంలోని పాస్నీలో లభించే కీలక ఖనిజాల రవాణాకు దీన్ని ఉపయోగించవచ్చనేది పాక్



ఆలోచన. అఫ్గానిస్థాన్ ఇరాన్ సరిహద్దులో ఉన్న బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఈ పాస్నీ ఒక ఓడరేవు పట్టణం. మునీర్ వైట్‌హౌస్ పర్యటనకు ముందే ఆయన అడ్వైజర్లు యూఎస్ అధికారులతో ఈ విషయంపై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే, అమెరికా సైనిక స్థావరాల కోసం మాత్రం ఈ ఓడరేవును ఉపయోగించుకోవడాన్ని పాక్ వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. దీనికి బదులుగా పశ్చిమ పాకిస్థాన్‌లోని ఖనిజాలు లభించే ప్రావిన్స్‌లకు టెర్మినల్‌ను అనుసంధానించే రైలు కారిడార్ అభివృద్ధికి నిధులు కోరినట్లు సమాచారం. ఈ టెర్మినల్ ప్రాజెక్టు గురించి అటు అమెరికా అధికారులు కానీ.. ఇటు పాక్ అధికారులు కానీ ఎవరు స్పందించలేదు.

## దేశం విడిచి వెళ్లిపోతే 2,500 డాలర్లు ఇస్తాం: ట్రంప్



రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులను దేశం నుంచి పంపించేందుకు అధ్యక్షుడు ట్రంప్ ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అందులోభాగంగా తాజాగా వలసదారుల పిల్లలకు ఆయన యంత్రాంగం ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. స్వచ్ఛందంగా దేశం వీడితే 2,500 డాలర్లు చెల్లిస్తామని తెలిపింది. అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈ విషయాన్ని వెల్లడించింది. 14 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వలసదారుల పిల్లలకు ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపింది. దేశం నుంచి స్వచ్ఛందంగా వెళ్లాలనుకునేవారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా ఈ 2,500 డాలర్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. దీనిపై స్పందించేందుకు వారికి 24 గంటల సమయం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఇది ఎప్పటినుంచి అందిస్తుందనే వివరాలు వెల్లడించలేదు. ఈ ఆఫర్‌ను తొలుత 17 ఏళ్ల పిల్లల నుంచి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారని రాయిటర్స్ పేర్కొంది. ఇక, ఈ చర్యలను ఇమిగ్రేషన్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఇది క్రూరమైన చర్య అని, పిల్లల రక్షణ చట్టాలను ఇది బలహీనపరుస్తుందన్నారు. వారి జీవితాలను ప్రమాదంలో పడేస్తాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 2021 అక్టోబరు నుంచి తల్లిదండ్రులు లేకుండా సరిహద్దులు దాటిన 4,00,000 కంటే ఎక్కువమంది పిల్లలను అమెరికా సరిహద్దు అధికారులు అరెస్టు చేశారు. 2008 చట్టం ప్రకారం వారిని తిరిగి స్వదేశాలకు పంపించే ముందు ఇమిగ్రేషన్ న్యాయమూర్తి ముందు వారిని హాజరుపరచాల్సి ఉంటుంది.

## ట్రంప్ సూచన బేఖాతరు.. గాజాపై మళ్లీ ఇజ్రాయెల్ దాడులు

ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఆపేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చినప్పటికీ గాజాపై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తోంది. శనివారం గాజా స్ట్రిప్‌లో ఐడీఎఫ్ బాంబు దాడులకు పాల్పడటంతో ఆరుగురు మృతి చెందగా పలువురు గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించామన్నారు. తాజా దాడుల్లో గాజాలోని ఓ ఇంట్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోగా ఖాన్ యూనిస్‌లో మరో ఇద్దరు మరణించారని తెలిపారు. బందీల విడుదలకు హమాస్ అంగీకరించడంతో దాడులు ఆపాలని ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచించినప్పటికీ.. గాజాలో బాంబు దాడులు కొనసాగడం గమనార్హం. బందీల విడుదలకు హమాస్ అంగీకరించిన నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ట్రంప్ ఇటీవల కీలక సూచనలు జారీ చేశారు. గాజాపై బాంబు దాడులను వెంటనే నిలిపివేయాలంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. 'హమాస్ ప్రకటన ప్రకారం.. శాశ్వత శాంతికి వారు సిద్ధంగా ఉన్నట్లు నమ్ముతున్నా.



ఇజ్రాయెల్ వెంటనే గాజాపై బాంబు దాడులను ఆపాలి. దీంతో మనం బందీలను సురక్షితంగా, త్వరగా విడుదల చేసుకోగలం. ప్రస్తుతం దానిపై దాడులు చేయడం చాలా ప్రమాదకరం' అని రాసుకొచ్చారు. ఇజ్రాయెల్‌కు ట్రంప్ చేసిన సూచనలను హమాస్ అభినందించింది. యుద్ధం ముగింపు, ఖైదీల మార్పిడి, గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరించుకోవడం వంటి వాటిపై వెంటనే చర్చలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉద్ఘాటించింది. ఇక, హమాస్ అంగీకారాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వాగతించారు. ఈక్రమంలోనే ట్రంప్ ప్రణాళికలోని తొలి దశ అమలుచేయడానికి తాము సిద్ధమవుతున్నామని వెల్లడించారు. గాజాపై యుద్ధం ఆపేందుకు ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల ఫార్ములాను అంగీకరిస్తున్నట్లు నెతన్యాహు ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్ మళ్లీ దాడులకు పాల్పడింది.

## పీఎన్‌బీ రుణ ఎగవేత కేసులో కీలక పరిణామం..

## నవంబర్ 23న భారత్‌కు నీరవ్ మోదీ..?




**న్యూఢిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.వేల కోట్ల రుణాలు ఎగవేసిన కేసులో.. డైమండ్ వ్యాపారి నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్ జైలులో శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. నీరవ్ మోదీని త్వరలోనే భారత్‌కు అప్పగించేందుకు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. బ్రిటన్ అధికారులు వచ్చే నెల అంటే నవంబర్ 23న నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించనున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. అతన్ని ముంబైలోని ఆర్థర్ రోడ్డు జైలులో ఉంచనున్నట్లు సమాచారం.

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు నీరవ్ మోదీ దాదాపు రూ.14 వేల కోట్ల రుణం ఎగవేసిన ఉదంతం 2018లో వెలుగులోకి వచ్చింది. ఆ వెంటనే అతను విదేశాలకు పారిపోయాడు. ఈ కేసును సీబీఐ, ఈడీ విచారిస్తోంది. దర్యాప్తులో భాగంగా నీరవ్ ఆస్తులను కూడా ఈడీ స్వాధీనం చేసుకుంది. ఈ ఆర్థిక నేరగాన్ని స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో నీరవ్ మోదీ తమదేశంలోనే నివసిస్తున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం 2018 డిసెంబర్‌లో ప్రకటించింది. దీంతో అతడిని తమకు అప్పగించాలని భారత్ విజ్ఞప్తి చేయగా.. 2019లో నీరవ్ మోదీని అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. అతన్ని భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపింది. 2021, ఏప్రిల్‌లో అతన్ని భారత్‌కు అప్పగించాలని ఆ నాటి యూకే హెూంమంత్రి ప్రీతి పటేల్ ఆదేశించారు.

ఇక ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఈడీ.. ఇప్పటిదాకా దేశ, విదేశాల్లోని రూ.2,596 కోట్ల విలువైన నీరవ్ ఆస్తుల్ని అటాచ్ చేసింది. ముంబైలోని బ్రాడీ హౌజ్ పీఎన్‌బీ శాఖ కేంద్రంగా ఈ కుంభకోణం జరిగింది. బ్యాంక్ ఉన్నతాధికారులతో కలిసి నకిలీ/మోసపూరిత ఎల్‌వోయూలతో నీరవ్, చోక్సీలు వేల కోట్ల రుణాలను పొందారు. ఇక ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటిదాకా రూ.1,052.42 కోట్ల సొమ్మును పీఎన్‌బీ, ఇతర బ్యాంకులకు అప్పజెప్పినట్టు ఈడీ వర్గాలు చెప్తున్నాయి.

## బిగ్ ఐపీఓల సందడి.. వచ్చేవారమే

## ఎల్‌జీ, టాటా క్యాపిటల్ ఇష్యూలు




**న్యూఢిల్లీ:** దేశీయ ప్రైమరీ మార్కెట్ వచ్చేవారం కళకళలాడనుంది. ఈసారి ఐదు పబ్లిక్ ఇష్యూలు సంయుక్తంగా రూ.28,500 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనున్నాయి. ఇందులో టాటా క్యాపిటల్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా వంటి రెండు బిగ్ ఐపీఓలు కూడా ఉన్నాయి. సాధారణంగా ఒకే వారంలో రెండు పెద్ద ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్‌కు రావడం అరుదు. అలాంటిది రెండు పేరు మోసిన కంపెనీలు ఒకేవారం సబ్‌స్క్రిప్షన్‌కు వస్తుండడం ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

టాటా గ్రూపునకు చెందిన ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూ అక్టోబర్ 6న ప్రారంభం కానుంది. 8న ముగియనుంది. మొత్తం రూ.15,512 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. ఈ ఏడాదిలో వస్తున్న అతిపెద్ద ఐపీఓల్లో ఇదీ ఒకటి. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.310-326గా నిర్ణయించింది. టాటా గ్రూపునకు ఉన్న విశ్వసనీయత, బలమైన రిటైల్, కార్పొరేట్ పోర్ట్‌ఫోలియో కారణంగా దీనిపై పెద్దఎత్తున మదుపర్లు దృష్టిసారించే అవకాశం ఉందని అనలిస్టులు భావిస్తున్నారు.

ఎప్పటినుంచో ఐపీఓ సన్నాహాల్లో ఉన్న మరో సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా. దక్షిణకొరియాకు చెందిన ఎల్‌జీ అనుబంధంగా ఉన్న ఈ సంస్థ.. దేశీయ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో అతిపెద్ద మార్కెట్ వాటా కలిగిఉంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ.11,607 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. అక్టోబర్ 7న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. 9న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.1,080-1,140గా నిర్ణయించింది.

మెయిన్‌బోర్డు విభాగంలో ఐపీఓకు వస్తున్న మరో కంపెనీ రూబికాన్ రీసెర్చ్. ఇదో ఫార్మాస్యూటికల్ కంపెనీ. మార్కెట్ నుంచి రూ.1,377 కోట్లు సమీకరించేందుకు అక్టోబర్ 9న సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. 13న బిడ్డింగ్ విండో ముగియనుంది. ధరల శ్రేణిని ఒక్కో షేరుకు రూ.461-481గా నిర్ణయించింది.

అనంతమ్ హైవేస్ ఇన్విట్ సంస్థ కూడా మెయిన్‌బోర్డు విభాగంలో రూ.400 కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ ఇష్యూ అక్టోబర్ 7న ప్రారంభమై 9న ముగియనుంది. ఈ నాలుగు మెయిన్‌బోర్డు ఐపీఓలు కలిపి ఒకే వారంలో రూ.28,500 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనున్నాయి.

ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో స్టీల్ ప్రొడక్షన్ కంపెనీ మిట్టల్ సెక్షన్స్ రూ.53 కోట్లు సమీకరించనుంది. అక్టోబర్ 7న దీని సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై 9తో ముగియనుంది. ధరల శ్రేణిని రూ.136-143గా నిర్ణయించింది.

## డిజిటల్ రేడియోలొస్తున్నాయ్!

### సేవల ప్రారంభానికి ట్రాయ్ సిఫారసులు

### తొలి దశలో హైదరాబాద్ సహా 13 నగరాల్లో



**న్యూఢిల్లీ:** ప్రస్తుత అనలాగ్ ఎఫ్ఎమ్ రేడియో ఛానళ్ల డిజిటలీకరణకు వీలు కల్పించే డిజిటల్ బ్రాడ్‌కాస్ట్ విధానానికి టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సిఫారసులను జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఒకటే తరహా సాంకేతిక ప్రామాణికతను అనుసరించాలని, 13 నగరాల్లో కొత్త ఫ్రీక్వెన్సీలకు వేలం నిర్వహించాలని కూడా ఈ సిఫారసుల్లో ఉన్నాయి. దేశ ఎఫ్ఎమ్ రేడియోను డిజిటల్ వైపునకు తీసుకెళ్లే ఈ పరిణామాన్ని తొలి అడుగుగా చెప్పొచ్చు. తొలి విడత కింద నాలుగు 'ఏ ప్లస్' నగరాలు- ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, 9 'ఏ' నగరాలు- హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, సూరత్, పుణె, జైపూర్, లఖ్‌నవూ, కాన్పూర్, నాగ్‌పుర్‌లో డిజిటల్ రేడియో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ 13 నగరాల్లో రెండు కొత్త స్పాట్ ఫ్రీక్వెన్సీస్‌లో వేలానికి ట్రాయ్ సిఫారసు చేసింది. ఇందుకు నగరాల వారీగా రిజర్వ్ ధరను నిర్ణయించారు. 'ఏ ప్లస్' నగరాలైన ముంబయిలో రూ.194.08 కోట్లు, ఢిల్లీలో రూ.177.63 కోట్లు, చెన్నైలో రూ.146.68 కోట్లు, కోల్‌కతాలో రూ.79.96 కోట్లుగా ఇది ఉండనుంది. అలాగే 'ఏ' విభాగ నగరాలైన బెంగళూరుకు రూ.87.22 కోట్లు, హైదరాబాద్‌కు రూ.65.85 కోట్లు, పుణెకు రూ.41.26 కోట్లు, అహ్మదాబాద్‌కు రూ.40.44 కోట్లు, నాగ్‌పుర్‌కు రూ.29.48 కోట్లు, జైపూర్‌కు రూ.26.89 కోట్లు, సూరత్‌కు రూ.25.89 కోట్లు, లఖ్‌నవూ రూ.24.59 కోట్లు, కాన్పూర్‌కు రూ.20.52 కోట్లుగా నిర్ణయించారు. డిజిటల్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్ సేవల పురోగతిపై మదింపు ఆధారంగా అనలాగ్ బ్రాడ్‌కాస్టింగ్‌కు ముగింపు పలికే తేదీని నిర్ణయించాలని సిఫారసుల్లో ట్రాయ్ సూచించింది.

# ఫస్ట్ టెస్టులో విండీస్ విలవిల..

### విండీస్‌పై టీమిండియా ఘన విజయం..

### రెండున్నర రోజుల్లోనే టెస్ట్ ఖతం

### ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన శుభ్‌మన్ గిల్ సేన

### మూడు రోజే ముగిసిన అహ్మదాబాద్ టెస్ట్

### భారత్ ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, జడేజాల సెంచరీలు

### రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 7 వికెట్లు పడగొట్టిన మహమ్మద్ సిరాజ్

**అహ్మదాబాద్:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు ఘన విజయం సాధించింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌ను రెండున్నర రోజుల్లోనే ముగించి, ఇన్నింగ్స్ 140 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన శుభ్‌మన్ గిల్ సేన.. కరేబియన్ జట్టును ఏ దశలోనూ కోలుకోనీయలేదు.







భారత్ ఆల్ రౌండ్ షో..

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బౌలింగ్ చేసిన భారత్, అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. భారత బౌలర్ల ధాటికి వెస్టిండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 162 పరుగులకే కుప్పకూలింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా, పరుగుల వరద పారించింది. కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా అద్భుత సెంచరీలతో కదం తొక్కగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ హాఫ్ సెంచరీతో రాణించాడు. దీంతో భారత్ 5 వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లోనే 286 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది.

రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ బ్యాటర్ల కథ మళ్లీ మొదటికే వచ్చింది. భారత బౌలర్ల పదునైన బంతులకు సమాధానం చెప్పలేక చేతులెత్తేశారు. వరుసగా వికెట్లు కోల్పోయి కేవలం 146 పరుగులకే ఆలౌట్ అయ్యారు. దీంతో భారత్ ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో సునాయాసంగా విజయం సాధించింది.

విండీస్ ను రెండో ఇన్నింగ్స్ లో చుట్టేయడంలో స్పిన్నర్ రవీంద్ర జడేజా, పేసర్ మహమ్మద్ సిరాజ్ కీలక పాత్ర పోషించారు. సిరాజ్ 31 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, జడేజా 54 పరుగులకు 4 వికెట్లు తీసి విండీస్ పతనాన్ని శాసించాడు. ఈ మ్యాచ్‌లో మొత్తంగా 7 వికెట్లు పడగొట్టిన సిరాజ్, తన అద్భుత ఫామ్‌ను కొనసాగించాడు.

ఈ గెలుపుతో రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య రెండో, చివరి టెస్ట్ మ్యాచ్ అక్టోబర్ 10 నుంచి ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనుంది.

## కాన్పూర్‌లో ఫుడ్ పాయిజన్..

### ఆస్పత్రిలో చేరిన ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్



**కాన్పూర్:** ఆస్ట్రేలియా ఏ జట్టుకు చెందిన ఫాస్ట్ బౌలర్ హెన్రీ థార్నటన్‌కు ఫుడ్ పాయిజన్ అయ్యింది. దీంతో అతన్ని కాన్పూర్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్ట్రేలియా ఏ జట్టుతో ఇండియా ఏ వన్డే సిరీస్ ఆడుతున్న విషయం తెలిసిందే. థార్న్‌టన్ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడ్డాడు. సిటీలో ఉన్న రీజెన్సీ హాస్పిటల్‌లో చేర్పించినట్లు అధికారులు తెలిపారు. టీమ్ బస చేస్తున్న హెూటల్‌లో ఆహారం తిన్న తర్వాత అతనికి ఉదర సంబంధిత సమస్యలు వచ్చినట్లు తెలుస్తోంది. తొలుత టీమ్ మేనేజ్మెంట్ ప్రాథమిక చికిత్స అందించింది. ఆ తర్వాత ఆస్పత్రిలో సీనియర్ల డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స కొనసాగింది. అయితే కాన్పూర్‌కు రావడానికి ముందే గ్యాస్ట్రో లక్షణాలతో థార్న్‌టన్ బాధపడుతున్నట్లు టీమ్ మేనేజర్ తెలిపాడు. ఈ ఘటన నేపథ్యంలో ఆస్ట్రేలియా టీమ్ మేనేజ్మెంట్ డైయిట్ ప్లాన్‌లో మార్పులు చేసింది. మరో ముగ్గురు ఆటగాళ్లు కూడా ఉదర సంబంధిత వ్యాధులతో బాధపడ్డారు. కానీ వాళ్లను ఆస్పత్రిలో చేర్పించలేదు. ఆస్ట్రేలియా ఏ, ఇండియా ఏ మధ్య జరిగిన రెండో వన్డేలో .. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆస్ట్రేలియా విజయాన్ని నమోదు చేసింది. 1-1 తేడాతో రెండు జట్లు సమంగా ఉన్నాయి. ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరగనున్నది.

### ముచ్చటగా మూడోసారి..

## సిద్ధమైన షోయబ్ మాలిక్..?

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ మాజీ ఆల్‌రౌండర్, టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మాజీ భర్త షోయబ్ మాలిక్ ముచ్చటగా మూడోసారి విడాకులకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సానియాకు విడాకులు ఇచ్చిన అనంతరం షోయబ్ పాక్‌కు చెందిన నటి సనా జావెద్‌ను గతేడాది మూడో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే పెళ్లైన ఏడాదికే సనాతో తన వివాహ బంధానికి స్వస్తి పలికేందుకు షోయబ్ సిద్ధమైనట్లు తెగ ప్రచారం జరుగుతోంది.

షోయబ్ మాలిక్ తొలుత హైదరాబాద్‌కు చెందిన అయేషా సిద్ధిఖీని 2002లో పెండ్లి చేసుకున్నాడు. అయితే.. 2010లో ఆమెతో వివాహ బంధానికి స్వస్తి పలికి సానియా మీర్జాను మనువాడాడు. 2010లో షోయబ్ మాలిక్, సానియా మిర్జాల వివాహం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. అనంతరం పాకిస్థాన్‌లోని సియాల్ కోట్‌లో వలీమా వేడుక జరిగింది. 2018లో ఈ దంపతులకు ఓ కుమారుడు (ఇజాన్) జన్మించాడు. అయితే.. షోయబ్ ప్రేమవ్యవహారాలతో విసిగిపోయిన సానియా అతడికి విడాకులు ఇచ్చేసింది. 'షరియా చట్టం'లోని 'ఖులా' పద్ధతిలో తన కూతురు షోయబ్‌కు డివోస్ ఇచ్చిందని సానియా తండ్రి ఇమ్రాన్ మిర్జా అప్పట్లో వెల్లడించిన విషయం తెలిసిందే.

సానియాతో విడాకుల అనంతరం షోయబ్ మాలిక్ ముచ్చటగా మూడోసారి పెండ్లి చేసుకుని



అందరికీ షాకిచ్చాడు. పాకిస్థాన్ ప్రముఖ సినీతారగా గుర్తింపు పొందిన సనా జావెద్‌ను గతేడాది జనవరి 22న వివాహం చేసుకున్నాడు. మాలిక్‌కు ఇది మూడో వివాహం కాగా, సనాకు రెండోది. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి విడాకులకు సిద్ధమైనట్లు టాక్ నడుస్తోంది.

# ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా గిల్

### టీ20లకు సూర్య సారథ్యం..

### వన్డేల్లోకి రోహిత్, కోహ్లి

**ముంబై:** ఆస్ట్రేలియాతో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు చెందిన భారతీయ జట్టును ప్రకటించారు. టీమిండియా వన్డే జట్టుకు శుభమన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఇక టీ20 సిరీస్ మ్యాచ్‌లకు సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలను నిర్వర్తిస్తాడు. ఆస్ట్రేలియా, ఇండియా మధ్య మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అక్టోబర్-నవంబర్ నెలల్లో ఆ మ్యాచ్‌లు ఉంటాయి. సీనియర్స్ మెన్స్ సెలక్షన్ కమిటీ భారత బృందాన్ని ఎంపిక చేసింది. అయితే వన్డేల్లో సీనియర్ క్రికెటర్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఛాన్స్ దక్కింది. ఆ ఇద్దర్నీ ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేశారు. ఇక వైస్ కెప్టెన్సీ బాధ్యతలను శ్రేయాస్ అయ్యర్‌కు అప్పగించారు. వన్డేలకు వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఎంపికయ్యాడు. వన్డే టీమ్‌లో నితీశ్, సుందర్, కుల్దీప్, హర్షిత్ రాణా, సిరాజ్, అర్షదీప్, ప్రసిద్ధ కృష్ణ, ధ్రువ్ జురెల్ , జైస్వాల్ కూడా ఉన్నారు.

ఆసీస్‌తో జరిగే టీ20 సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. ఆ జట్టులో అభిషేక్ శర్మ, గిల్, తిలక్ వర్మ, నితీశ్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, బుమ్రా, అర్షదీప్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ సాంసన్, రింకూ సింగ్, సుందర్ ఉన్నారు. అయితే వన్డే జట్టుకు స్పీడ్ బౌలర్ బుమ్రాను ఎంపిక చేయలేదు.

తొలుత వన్డేలు జరుగుతాయి. అక్టోబర్ 19వ తేదీన పెర్త్‌లో ఫస్ట్ వన్డే, అడిలైడ్‌లో 23న రెండో వన్డే, 25న సిడ్నీలో మూడో





వన్డే ఆడనున్నారు. తొలి టీ20 అక్టోబర్ 29వ తేదీన కెనబెరాలో జరగనున్నది. మెల్‌బోర్న్‌లో రెండో టీ20 అక్టోబర్ 31వ తేదీన, మూడవ మ్యాచ్ నవంబర్ 2న హెూబర్ట్‌లో, నాలుగో టీ20 గోల్డ్ కోస్టులో నవంబర్ 6న, 5వ టీ20 బ్రిస్బేన్‌లో నవంబర్ 8వ తేదీన ఆడుతారు. కెప్టెన్సీ మార్పు గురించి రోహిత్ శర్మకు తెలియజేసినట్లు చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపారు.

# నీలిరంగు చీరలో రాశి ఖన్నా సొగసులు..



టాకీస్: తెలుగులో వరుస సినిమాలతో తనకంటూ మంచి ఇమేజ్ క్రియేట్ చేసుకున్న హీరోయిన్ రాశి ఖన్నా. ప్రస్తుతం ఈ అమ్మడు హిందీలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరిస్తుంది. ఇటీవలే సిద్ధార్థ్ మల్హోత్రా సరసన యోధ చిత్రంలో నటించింది. కానీ మీకు తెలుసా.. రాశి ఖన్నా చిన్నప్పటి నుంచి నటి కావాలని అనుకోలేదు. రాశి ఖన్నా12వ తరగతిలో టాపర్‌గా నిలిచింది. రాశి అధికారిణి కావాలని కలలు కన్నది. అందుకోసమే ఎక్కువగా చదువుతూ ఉండేది. కానీ అనూహ్యంగా సినిమాల్లోకి అడుగుపెట్టింది. మోడలింగ్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు..ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చింది. నెమ్మదిగా అవకాశాలు అందుకుంది. జాన్ అబ్రహం చిత్రం "మద్రాస్ కేఫ్" తో రాశి ఖన్నా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఈ చిత్రంలో ఆమె పాత్ర చాలా చిన్నది. ఆ తర్వాత తెలుగు, తమిళంలో వరుస అవకాశాలు అందుకుంది. ఇప్పుడు ఈ అమ్మడు పాన్ ఇండియా హీరోయిన్.. నెట్టింట విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. మలయాళ పరిశ్రమలో, "విలన్" చిత్రంతో నటిగా మంచి మార్కులు కొట్టేసింది. కొన్ని రోజుల ఫర్జీ అనే వెబ్ సిరీస్ చేసింది. అయితే కొన్నాళ్లుగా తెలుగులో ఈ బ్యూటీకి అంతగా అవకాశాలు తగ్గిపోయాయి. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. నీలిరంగు చీరలో గ్లామర్ ఫోజులతో మతిపోగొట్టేస్తుంది ఈ వయ్యారి. ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ.. ఆ తర్వాత గోపిచంద్ సరసన జిల్ సినిమాలో మెరిసింది. ఈ బ్యూటీ అందాలకు ఇప్పుడు కుర్రకారు ఫిదా అవుతున్నారు.

# పుకార్లకు ఫుల్‌స్టాప్

## నిశ్చితార్థం చేసుకున్న గీతగోవిందం జంట



**టాకీస్:** కొంతకాలంగా ప్రేమలో ఉన్న విజయ్ దేవరకొండ, రష్మిక త్వరలో వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు. ఇరు కుటుంబాలు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో హైదరాబాద్‌లో వీరి నిశ్చితార్థం శుక్రవారం జరిగినట్లు సమాచారం. ఇరువురి కుటుంబాలు పెళ్లి ఏర్పాట్లలో నిమగమవుతుండగా, ఫిబ్రవరిలో ఈ జంట పెళ్లి పీటలెక్కబోతుందని విశ్వసనీయ సమాచారం. ప్రముఖ సినీ, రాజకీయ, వ్యాపార రంగానికి చెందినవారంతా ఆ వివాహ వేడుకలో పాల్గనే అవకాశం ఉంది. విజయ్ దేవరకొండ, రష్మిక ఇప్పటికే కలిసి నటించిన గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాల ద్వారా రొమాంటిక్ కెమిస్ట్రీతో మిలియన్ల అభిమానులను ఆకట్టుకున్నారు. అప్పట్నుంచి వీరి జంటపై అభిమానుల్లో ఒక ప్రత్యేకమైన అటాచ్‌మెంట్ ఏర్పడింది. ఇప్పుడు వీరి వివాహం అధికారికమవుతుందన్న వార్తతో సోషల్ మీడియాలో అభిమానులు ఆనందంతో మునిగిపోయారు.



# దూకుడు మీదున్న ధనుష్



టాకీస్: ఈ ఏడాది సౌత్ హీరోల నుంచి వరుస సినిమాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. అదే తరహాలో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటుడు ధనుష్ కూడా హిట్ ఫట్ తో సంబంధం లేకుండా తన సినిమాలతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే కుబేర, ఇడ్లీ కొట్టు సినిమాలను ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసిన ధనుష్, వీటి తర్వాత కూడా వెనక్కి తగ్గకుండా మరిన్ని ప్రాజెక్టులను రెడీ చేస్తున్నాడు. బాలీవుడ్‌లో తన మరో సినిమా తేరే ఇష్క్ మైన్గ్ ÷నైల్ స్టేజ్‌కి చేరుకుంది. ఈ చిత్రం నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళ సినిమాలతో పాటు హిందీ సినిమాల్లో కూడా తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్కెట్ ఉన్న ధనుష్, ఈ మూవీతో బాలీవుడ్ ఆడియన్స్‌ను మళ్లీ ఆకట్టుకోబోతున్నాడు. ఇక ఈ సినిమా తర్వాత ఎక్కువ గ్యాప్ లేకుండానే తన 54వ సినిమా కూడా థియేటర్లలోకి రానుంది. దర్శకుడు విగ్నేష్ రాజా తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ షూటింగ్ ఇటీవలే పూర్తి అయ్యింది. అందువల్లే ఫిబ్రవరి 2026 లో ఈ సినిమా రిలీజ్ చేయాలని మేకర్స్ ఇప్పటికే నిర్ణయించుకున్నారని సమాచారం. ఇలా వరుస సినిమాలను ప్లాన్ చేస్తూ, రిలీజ్ చేసేందుకు సిద్ధం అవుతున్న ధనుష్ తన కెరీర్ పేస్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఒకేసారి తమిళం, హిందీ సినిమాలు చేస్తూ, విభిన్న జానర్స్‌లో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తున్న ధనుష్ రాబోయే నెలల్లో ఫ్యాన్స్‌కి నిజంగానే ఫుల్ మాస్ ట్రీట్ ఇవ్వబోతున్నాడు.

# పవన్‌తో మరోమారు దిల్‌రాజ్ సినిమా



**టాకీస్:** టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్ కు రంగం సిద్ధమవుతోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు మరోసారి చేతులు కలపబోతున్నారు. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన 'వకీల్ సాబ్' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే ఫార్ములాను రిపీట్ చేస్తూ, మరో ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మించడానికి దిల్ రాజు సన్నాహాలు చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, నిర్మాత దిల్ రాజు ఇటీవలే పవన్ కళ్యాణ్ డేట్స్ ను ఖరారు చేసుకున్నారు.

'వకీల్ సాబ్' మాదిరిగానే, బలమైన సోషల్ మెసేజ్ తో పాటు, పవన్ కళ్యాణ్ మాస్ ఇమేజ్ కు, ఆయన అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉండేలా ఈ సినిమాను రూపొందించాలని ఆయన భావిస్తున్నారు. కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉంటూనే, కథలో ఒక సందేశం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం దిల్ రాజు ప్రస్తుతం సరైన కథ, దర్శకుడి కోసం అన్వేషణలో ఉన్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' రిలీజ్ కి రెడీ అవుతోంది. దిల్ రాజు సినిమా త్వరలోనే సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ వార్త తెలియగానే పవర్ స్టార్ అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. 'వకీల్ సాబ్' వంటి మరొక పవర్-ప్యాక్డ్ పెర్ఫార్మెన్స్ ను తమ అభిమాన నటుడి నుంచి ఆశిస్తున్నారు.

# గోపిచంద్ మలినేనితో బాలయ్య సినిమా

**టాకీస్:** 'వీరసింహారెడ్డి' విజయం తర్వాత కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని మరోసారి కలిసి పని చేయనున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ సినిమాని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 24న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు విజయ దశమి సందర్భంగా ప్రకటించారు. చారిత్రక అంశాలతో ముడిపడిన యాక్షన్ కథతో రూపొందనున్న చిత్రమిది. బాలకృష్ణ ఇందులో మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయని చిత్ర బృందం తెలిపింది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. ఇక ప్రస్తుతం



బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2: తాండవం' సినిమాని డిసెంబరు 5న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు దసరా సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు విడుదల తేదీతో కూడిన కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ సినిమాకి బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తుండగా.. రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు.

# స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెబితే నమ్మరు: జాన్వీ

టాకీస్: నెపోటిజం, సినీ నేపథ్యం పదాలు ఇండస్ట్రీలో ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటాయి. బయటి వ్యక్తులు పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకోవడానికి ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కోవాలని స్టార్స్ సైతం అంగీకరిస్తుంటారు. తాజాగా ఈ అంశంపై జాన్వీకపూర్ ఓ చర్చలో మాట్లాడారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారని కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. 'ఇన్‌సైడర్ అవుట్‌సైడర్' చర్చలో పాల్గొన్న జాన్వీకపూర్ నటీనటులను బయట వ్యక్తులు, సినీ పరిశ్రమకు చెందినవారు అని విభజించడం తనకు ఇష్టం లేదన్నారు. బయట నుంచి పరిశ్రమకు వచ్చినవారితో ఇండస్ట్రీ వారి కష్టాలను పోల్చడం అన్యాయమని అన్నారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయి. వాటిని వినడానికి కూడా ఎవరూ ఆసక్తి చూపరు. అయినా ఇండస్ట్రీలో ఉన్న స్టార్ కిడ్స్ ఎవరూ కష్టాలు పడ్డామని చెప్పరు. ఎందుకంటే బయటి వారితో పోల్చితే వారికి లభించిన సౌకర్యాలకు వారెప్పుడూ కృతజ్ఞతతోనే ఉంటారు. అలాకాకుండా 'మేం ఇంత కష్టపడుతున్నాం' అని చెబితే ఎవరూ వినరు. బయటి నుంచి వచ్చిన వ్యక్తులు ఇండస్ట్రీలో గుర్తింపుతెచ్చుకోవాలంటే ఎన్నో పోరాటాలు చేయాలని నేనూ అంగీకరిస్తాను. ఆ పోరాటాలు స్టార్ కిడ్స్‌కు అర్థం కావని జాన్వీ తెలిపారు. శ్రీదేవి కుమార్తెగా వెండితెరకు పరిచయమై.. మంచి పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు జాన్వీకపూర్. ఉత్తరాదితో పాటు దక్షిణాదిలోనూ అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. వరుణ్ ధావన్‌తో కలిసి ఆమె నటించిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.